నమస్తే తెలంగాణ

వరంగల్

5 | వరంగల్, ఆదివారం 24 నవంబర్ 2024 | WARANGAL



వాజేడు మండలంలోని ప్రగళ్లపల్లిలో రహదారిని కమ్ముకున్న మంచుదుప్పటి



బాలసముద్రం వద్ద చలిమంట కాగుతున్న యువకులు

# చలి పంజా..

## వారం నుంచి ఒకటే వణుకు

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- అంబటాళ్ల దాటినా బయటకు రాని జనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

చలి పంజా విసురుతున్నది. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు 13.8 డిగ్రీల కనిష్ట స్థాయికి పడిపోతుండడంతో తెల్లవారుజాము నుంచే మంచు కమ్మేస్తూ మస్తు ఇగం పెడుతున్నది. దీంతో అంబటాళ్ల దాటినా జనం ఇంట్లో నుంచి బయటకు రాక రహదారులు, వీధులు బోసిపోతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లని గాలులు వీయడమే గాక భానుడి జాడ లేక పగలు కూడా చలి తీవ్రత ఎక్కువగానే ఉంటున్నది. దీం తో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. చలి పెరగడంతో స్వెట్టర్లు, జర్కిన్స్, మఫ్లర్లు లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి ఉన్నది. ఇటు వ్యవసాయంపైనా చలి ప్రభావం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందు ఉష్ణోగ్రతలు మరింత ఇంకా తగ్గుతాయనే వాతావరణ శాఖ ప్రకటన నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. - హనుమకొండ/హనుమకొండ సబర్బన్, నవంబర్ 23

### వారం రోజుల ఉష్ణోగ్రతల వివరాలు

| తేదీ | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| 17 | 31.0 | 17.0 |
| 18 | 30.5 | 15.0 |
| 19 | 30.0 | 15.5 |
| 20 | 30.5 | 14.5 |
| 21 | 30.2 | 14.5 |
| 22 | 30.0 | 14.5 |
| 23 | 28.5 | 13.8 |



కొత్త స్వెట్టర్లు ధరించి మురిసిపోతున్న చిన్నారులు

### జాగ్రత్తలు తప్పనిసరి

తెల్లవారుజాము నుంచే మంచు కమ్మేస్తున్నది. రోజురోజు ఉష్ణోగ్రతలు తగ్గి చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అలర్జీ, బీపీ, గుండె, అస్తమా, శ్వాసకోస సంబంధ వ్యాధులున్నవారు మరింత శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చలికాలంలో దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి, ఊపిరితుత్తుల సమస్య, తుమ్ములు వస్తాయని, చిన్నారుల ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశాలుంటాయి. గాలి ద్వారా సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించడంతో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని, వీటన్నింటిని తట్టుకోనేందుకు తగిన జాగ్రత్తలు తీసుకొంటేనే వ్యాధుల బారిన పడకుండా ఉంటామని డాక్టర్లు చెబుతున్నారు.

**వ్యవసాయానికి ప్రతికూలం**

ఒక్కసారిగా పెరిగిన చలితో వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం చూపనున్నది. ప్రస్తుతం చాలాచోట్ల వరి కోతలు పూర్తయి, నార్లు పోసుకుంటున్నారు. అయితే ఈ చలి వల్ల నార్లు మొలకెత్తే పరిస్థితి లేదు. మొలక శాతం తక్కువగా వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇతర పంటలు కూడా ఏపుగా రావని అంటున్నారు. పశువులు వ్యాధుల బారిన పడే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు.



హనుమకొండ పాత మున్సిపల్ మైదానంలో స్వెట్టర్లను కొనుగోలు చేస్తున్న ప్రజలు

# 22,554 ఇదీ టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య

- ముసాయిదా ఓటర్ల జాబితా వెల్లడి
- వచ్చే నెల 9వరకు అభ్యంతరాల స్వీకరణ
- వచ్చే నెల 25న తుది జాబితా



నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ-ఖమ్మం-వరంగల్ శాసన మండలి ఉపాధ్యాయ నియోజవర్గానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. మొత్తం 22,554మంది ఓటర్లతో కూడిన ముసాయిదా జాబితాను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో గత నెల నుంచే ఓటు నమోదుకు షెడ్యూల్ విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 6 వరకు ఓటర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాల నుంచి ఓటు హక్కు కోసం మొత్తం 28,698మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 6,144 దరఖాస్తులు తిరస్కరించగా మిగిలిన 22,554 దరఖాస్తుల ఆధారంగా జాబితాను సిద్ధంచేశారు. ఇందులో పురుషులు 13,498మంది, మహిళలు 9056మంది ఓటర్లుగా ఉన్నారు. ఈ జాబితాను అన్నీ తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచనున్నారు. అభ్యంతరాలను వచ్చే నెల 9వరకు స్వీకరిస్తారు. దీంతో పాటు కొత్త ఓట్ల కోసం దరఖాస్తులకు సైతం అనుమతిస్తున్నారు. 9 తర్వాత వచ్చిన అభ్యంతరాలు, దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల 25వరకు తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తారు.

**పెరిగిన ఓటర్లు, పోలింగ్ కేంద్రాల సంఖ్య**

ప్రస్తుతం ఈ స్థానం నుంచి యూటీఎఫ్‌కు చెందిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన పదవీకాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎన్నికల కమిషన్ తెరలేపింది. 2019 మార్చిలో జరిగిన గత ఎన్నికల్లో మొత్తం 20,888 మంది ఓటర్లు ఉండగా ఈసారి ఓటర్ల సంఖ్య పెరగనున్నది. ఇప్పటికే ముసాయిదా జాబితా ప్రకారమే గతంతో పోలిస్తే అదనంగా 1,666 మంది పెరిగారు. తుది జాబితా ప్రకటించే నాటికి వీరి సంఖ్య మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక పోలింగ్ కేంద్రాల సంఖ్య కూడా గతంలో 181 ఉండగా ఈసారి వాటి సంఖ్య 200కు పెరిగింది. అంటే అదనంగా 19 పోలింగ్ కేంద్రాలు కొత్తగా రానున్నాయి.

| జిల్లా | పోలింగ్ కేంద్రాలు | ఓటర్లు |
|---|---|---|
| హనుమకొండ | 15 | 4,424 |
| వరంగల్ | 13 | 1,923 |
| మహబూబాబాద్ | 16 | 1,270 |
| జనగామ | 12 | 810 |
| ములుగు | 9 | 572 |
| భూపాలపల్లి | 7 | 264 |

## పింఛన్ కోసం అగచాట్లు



ఇక్కడ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు కూర్చున్న వీరంతా ఆసరా పింఛన్ తీసుకునేందుకు వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన వీరు రెండు రోజులుగా ఇలాగే అగచాట్లు పడుతున్నారు. ఇక్కడ 1,230 మంది లబ్ధిదారులుండగా, ఇందులో 210 మంది దివ్యాంగులు, 150 మంది మంచానికే పరిమితమైన వారున్నారు. గతంలో ఇక్కడ పింఛన్లు ఇచ్చే వ్యక్తి పలుచోట్ల కూర్చొని పంపిణీ చేయడంతో పాటు నడవలేని, మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి అందజేసేవాడు. అయితే ఈ నెల నుంచి చిల్పూరు మండలం చిన్న పెండ్యాలకు చెందిన బీపీఎంకు బాధ్యతలు అప్పగించడంతో అతడు గ్రామ పంచాయతీలోనే పంపిణీ చేస్తున్నాడు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు జీపీకి చేరుకొని సాయంత్రం వరకు ఇబ్బందులు పడుతూ పింఛన్ తీసుంటున్నారు. అధికారులు స్పందించి గతంలో లాగానే ఒకేచోట కాకుండా పలుచోట్ల పంపిణీ చేయడంతో పాటు మంచానికే పరిమితమైన, నడవలేని వారి ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ ఇవ్వాలని కోరుతున్నారు. – స్టేషన్‌ఘన్‌పూర్, నవంబర్ 23

## ఆదివాసీల ఆగ్రహజ్వాల

- మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు
- ఏటూరునాగారంలో భారీ ర్యాలీ

రెండు రోజుల క్రితం ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన ఇద్దరు ఆదివాసీలు ఉయిక అర్జున్, ఉయిక రమేశ్‌ను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హతమార్చడంపై ఆదివాసీలు నిరసన చేపట్టారు. శనివారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ నుంచి బస్టాండ్ వరకు మావోయిస్టులకు వ్యతిరేకంగా బ్యానర్లు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. ఏటూరునాగారం, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల్లోని సుమారు 30 గూడేల నుంచి గొత్తికోయలు, ఆదివాసీలు సుమారు 3 వేల మంది వరకు తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. మావోయిస్టు పోరాటం అంటే అమాయక ఆదివాసీలను చంపడమేనా అంటూ బ్యానర్లను ప్రదర్శించారు. ఈ ఘటనపై ప్రజా సంఘాలు స్పందించాలని కోరారు. ఆదివాసీలు, మహిళలు, యువకులు, యువతులు పాల్గొన్న ఈ ర్యాలీ సుమారు గంట పాటు కొనసాగింది. –ఏటూరునాగారం, నవంబర్ 23



ఏటూరునాగారంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు



సర్వే వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

# గుట్టలు దిగితేనే సర్వే

- భద్రతా కారణాలతో పెనుగోలు గ్రామానికి వెళ్లని ఎన్యుమరేటర్లు
- కిందకు వస్తేనే వివరాలు నమోదు చేస్తామని అధికారుల కబురు
- సందిగ్ధంలో 15 గిరిజన కుటుంబాల సమగ్ర సర్వే

వాజేడు, నవంబర్ 23 : ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టలపై నివసిస్తున్న పెనుగోలు గ్రామస్తులు కిందికి వస్తేనే సమగ్ర కుటుంబ సర్వే వివరాలు నమోదు చేస్తామని అధికారులు వెల్లడించారు. మండల కేంద్రానికి దూరంగా గుట్టలపై 15 గిరిజన కుటుంబాలు ఉంటున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ, రాజకీయ, కుల సర్వేలో వీరి వివరాలు ఇప్పటి వరకు నమోదు చేయలేదు. ఇప్పటికే మండలంలో సేకరించిన సర్వే వివరాలను మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే ఎన్యుమరేటర్లు గుట్టపై ఉన్న గిరిజనుల వివరాల సేకరణపై సందిగ్ధత నెలకొంది. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు, కొంగాల గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి చాట్ల ప్రభాకర్‌ను వివరణ కోరగా, భద్రతా కారణాల వల్ల గుట్టపైకి వెళ్లలేదని, అక్కడున్న వారిని కిందకు రావాలని కబురు పంపామని, వారు వస్తే వివరాలు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌ను చీదరించుకున్న మహారాష్ట్ర ప్రజలు

- రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిండ్రు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు
- ప్రజాపాలన విజయోత్సవాలను నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న పుట్ట మధు, బీఆర్‌ఎస్ శ్రేణులు

మహాముత్తారం, నవంబర్ 23 : తెలంగాణ మాదిరిగానే మహారాష్ట్రలో పథకాలు అమలు చేస్తామని ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీని అక్కడి ప్రజలు చీదరించుకున్నారని, కనీసం వారికి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవాలను నిరసిస్తూ శనివారం మహాముత్తారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి నల్లబ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయంటూ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ చేశారని, ఏడాది కావస్తున్నా ఇంటి స్థలాలు, రూ. 5 లక్షలు మంజూరు చేయలేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మండలంలోని కోనంపేటలో 73 డబుల్ బెడ్రూం ఇండ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. రేవంత్ సర్కారు ఆరు గ్యారెంటీలతోపాటు 420హామీల్లో ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశామని నిరూపిస్తే తాము కండువాలు తీసి కాంగ్రెస్ సంబురాల్లో పాల్గొంటామన్నారు. మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు తన నియోజకవర్గంలో ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదని విమర్శించారు. ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పోలీసులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నట్లు పనిచేస్తున్నారని, అలా చేస్తే భవిష్యత్ ఉండదన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రజా వంచన దినోత్సవాన్ని నిర్వహిస్తామని, శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పుట్ట మధు పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు భగవద్గీత పోటీలు


**డిసెంబర్ 5 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహణ**

పోచమ్మమైదాన్, నవంబర్ 23: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గీతా జయంతిని పురస్కరించుకుని శ్రీమద్ భగవద్గీతలోని ఆరో అధ్యాయం ఆత్మ సంయమయోగ శ్లోక కంఠస్థ పోటీలను ఆరో తరగతి నుంచి ఏడో తరగతి మొదటి గ్రూపు, 8, 9 తరగతులను రెండో గ్రూప్‌గా విభజించి ఈ పోటీలు నిర్వహించన్నుట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 5న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, 6న వరంగల్ పిన్నవారివీధిలోని శారద ఉన్నత పాఠశాల, 7న ములుగు జిల్లా సాధన ఉన్నత పాఠశాల, 8న జనగామ జిల్లా బాణాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, 9న మహబూబాబాద్ జిల్లా ఏకశిలా ఉన్నత పాఠశాల, 11న హనుమకొండ జిల్లా నక్కలగుట్టలోని ఎస్ఎంఆర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే, 18 అధ్యాయాలు పూర్తిగా వచ్చిన వారిని కూడా రెండు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆరు నుంచి 18 ఏళ్ల వరకు ఒక బ్యాచ్, 18 ఏళ్లు దాటిన వారిని రెండో బ్యాచ్‌గా చేసి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తిగల వారు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# దొంగల కోసం వేట?

- పోలీసులకు సవాల్‌గా మారిన ఎస్‌బీఐ దోపిడీ ఘటన
- ఛేదించేందుకు విశ్వ ప్రయత్నాలు
- 10 ప్రత్యేక బృందాలతో గాలింపు?
- బ్యాంకు ఖాతాదారుల ఆందోళన


రాయపర్తి, నవంబర్ 22 : వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దోపిడీ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. భారీ దొంగతనం జరిగి నాలుగు రోజులైనా ఎలాంటి ఆధారాలు లభించకపోవడం వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. దొంగల వేటలో పోలీసులు బిజీబిజీగా ఉండగా, బ్యాంకులో తాము దాచుకొన్న బంగారం ఉందో.. పోయిందో తెలియక ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల18న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆక్సిజన్ సిలిండర్, 5 కిలోల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, జోకర్ అగ్గిపెట్టెలతో బ్యాంకులోకి ప్రవేశించి, సీసీ కెమెరాలు, అత్యవసర అలారాన్ని ధ్వంసం చేశారు. సీసీ టీవీ ఫుటేజీ డీవీఆర్‌లతోపాటు బ్యాంకులోని లాకర్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి సుమారు 19 కిలోలకు పైగా బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ నెల 20న వరంగల్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ ఉండడంతో బందోబస్తులో ఉన్న పోలీసులు, మరుసటి రోజు రంగంలోకి దిగారు. జిల్లా పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాతోపాటు వెస్ట్, ఈస్ట్, సెంట్రల్ జోన్ డీసీపీలు రాజమహేంద్రనాయక్, రవీందర్, మహ్మద్ సలీమా బ్యాంకును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాధ్యమైనంత తొందరగా దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. వర్ధన్నపేట సబ్ డివిజన్‌లోని రాయపర్తి, వర్ధన్నపేట, జఫర్‌ఘడ్, కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల పోలీస్ అధికారులతోపాటు కమిషనరేట్ పరిధిలోని రఘునాథపల్లి, చిల్పూరు, పర్వతగిరి, నర్సంపేట, సీసీఎస్, క్రైం బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్ అధికారులతో 10 బృందాలను ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో సుమారు 15 మంది ఎస్సైలు, 10 మంది సీఐలు, ముగ్గురు ఏసీపీలతోపాటు డీసీపీ భాగస్వాములైనట్లు తెలుస్తున్నది. దొంగల ముఠాను పట్టుకునే క్రమంలో కర్నాటక రాష్ట్రానికి చెందిన పలువురు పోలీస్ అధికారుల సహకారం తీసుకున్నట్లు తెలుస్తున్నది.





**కర్నాటకలోనూ గాలింపు**

బ్యాంకు దొంగతనానికి వచ్చిన దొంగల ముఠా తమ పని కానిచ్చేసి, దొంగతనానికి వినియోగించిన ఆక్సిజన్ సిలిండర్, 5 కేజీల ఎల్‌పీజీ సిలిండర్, గ్యాస్ కట్టర్ మిషన్లు, జోకర్ కంపెనీకి చెందిన అగ్గిపెట్టెను అక్కడే వదిలి వెళ్లినట్లు తెలిసింది. దీంతో జోకర్ అగ్గిపెట్టె తయారీతోపాటు విరివిగా వినియోగించే కర్నాటక రాష్ట్రానికి చెందిన వారే దొంగతనానికి పాల్పడి ఉండొచ్చన్న అనుమానంతో పోలీసులు ఆ రాష్ట్రంలోనూ గాలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా, బ్యాంకులో తాము దాచుకొన్న బంగారం ఉందో.. పోయిందో.. అని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. తమను కనీసం లోపలికి కూడా అనుమతించడం లేదని బంగారం తనఖా పెట్టి రుణాలు తీసుకున్న వారు బ్యాంకు వద్దే పడిగాపులు పడుతున్నారు.



శాయంపేట: చలివాగులో నూతనంగా నిర్మించిన ఇంటేక్ వెల్



చలివాగు నుంచి టెక్స్‌టైల్ పార్కుకు చేరిన గోదావరి జలాలు

# ఆటంకాలు లేకుండా..

## మెగా టెక్స్‌టైల్ పార్కుకు చేరిన గోదావరి జలాలు

- చలివాగు నుంచి చేపట్టిన ట్రయల్ రన్ సక్సెస్
- 40 కిలోమీటర్లు పైపులైన్ ద్వారా నీటి సరఫరా
- హర్షం వ్యక్తం చేసిన మిషన్ భగీరథ అధికారులు
- ప్రతి రోజు 12 ఎంఎల్‌డీల నీటి సరఫరాకు చర్యలు
- రూ. 100 కోట్లతో పనులు చేపట్టిన గత కేసీఆర్ సర్కారు

శాయంపేట, నవంబర్ 23 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు నుంచి వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు గోదావరి జలాలు చేరుకున్నాయి. ఇటీవల భగీరథ అధికారులు పైప్‌లైన్ పనులు పూర్తి చేసి చేపట్టిన ట్రయల్ రన్ సక్సెస్ అయింది. 40 కిలోమీటర్ల దూరంలోని పార్కుకు నీరు చేరడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీఎం మిత్ర పథకంలో భాగంగా గత కేసీఆర్ సర్కారు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం బొడ్డుచింతలపల్లి గ్రామాల పరిధిలో మెగా టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసింది. ఈ పార్కుకు అవసరమైన నీటిని చలివాగు నుంచి తరలించేందుకు రూ.100 కోట్లతో 2022 సెప్టెంబర్‌లో పనులు చేపట్టింది. శాయంపేట, గూడెప్పాడ్, ఊరుగొండ, అక్కంపేట, కోనాయమాకుల నుంచి మెగా టెక్స్‌టైల్ పార్కు వరకు 40 కిలోమీటర్ల మేర భూగర్భ పైపులైన్ పనులను మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు పూర్తిచేశారు. ప్రతిరోజూ చలివాగు రిజర్వాయర్ నుంచి 1.20కోట్ల లీటర్ల (12ఎంఎల్‌డీ) నీటిని టెక్స్‌టైల్ పార్కుకు తరలించనున్నారు. ఇందుకోసం చలివాగులో నూతనంగా ఇన్‌టేక్ వెల్ నిర్మించి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మూడు 240 హెచ్‌పీ మోటర్లలో రెండింటి ద్వారా టెక్స్‌టైల్ పార్కుకు నీటి సరఫరా జరగనుంది. టెక్స్‌టైల్ పార్కుకు అవసరమైన శుద్ధ జలాలు అందించే 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నిర్మాణం మరో నెలన్నర రోజుల్లో పూర్తి కానున్నది. అలాగే 2,500 కేఎల్ సంప్ పూర్తయ్యిందని, దాని పక్కనే పంప్ హౌస్ నిర్మిస్తున్నామని, పనులు పూర్తి కావడంతో పాటు పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటైతే నిరంతరం నీటిని పంపింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు డీఈ శ్రీనివాస్ తెలిపారు. పైప్‌లైన్ పనులను వేగంగా పూర్తిచేసిన భగీరథ ఇంజినీరింగ్ అధికారులు ఇటీవల రెండు మోటర్లను ఆన్‌చేసి ఎలాంటి ఆటంకాలు లేకుండా ట్రయల్ రన్ నిర్వహించారు.



నిర్మాణంలో ఉన్న వ్యర్థ జలాలను తొలగించే ప్లాంట్